సాక్షి
విశాఖపట్నం
గురువారం। 10। ఏప్రిల్। 2025


గిఫ్ట్ డీడ్ భూముల్లో గోల్‌మాల్ 8లో


బాలికల విద్యకు బాసట 8లో


తీర ప్రాంతాల్లో 'సాగర్ కవచ్' 8లో

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


రోగుల యోగక్షేమాలను తెలుసుకుంటున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఉదయం తన కార్యాలయానికి వచ్చే క్రమంలో ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఓపీ కౌంటర్ల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. హెల్ప్ డెస్కు పనితీరు, కౌంటర్ల వద్ద సదుపాయాల స్థితిగతులను గమనించారు. అభ యాప్ ద్వారా ఓపీ టికెట్ తీసుకునే విధానం, రోగులకు వైద్యులు, సిబ్బంది నుంచి అందుతున్న సహకారంపై ఆరా తీశారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓపీ తీసుకునేందుకు ఎంత సేపు నిరీక్షిస్తున్నారు.. హెల్ప్ డెస్కులో ఉన్న వారు పూర్తి సహకారం అందిస్తున్నారా? వైద్య సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది వ్యవహార శైలి, సదుపాయాలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద, ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్ ఉన్నారు.

వేసవి క్రికెట్ శిక్షణకు ఎంపికలు


విశాఖ స్పోర్ట్స్: వేసవిలో క్రికెట్ శిక్షణకు ఎంపికలు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. అండర్ 10, 12, 14, 16 ఏళ్ల గ్రూప్‌ల్లో వార్షిక శిక్షణా శిబిరాలు మే 3వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ బి గ్రౌండ్‌లో అండర్–10 ఎంపికలు ఈనెల 19, 20వ తేదీల్లోనూ, అండర్–12 ఎంపికలు 21, 22వ తేదీల్లోనూ జరగనున్నాయి. అండర్–16 ఎంపికలు 23, 24వ తేదీల్లోనూ, అండర్–16 ఎంపికలు ఈనెల 25, 26వ తేదీల్లోనూ నిర్వహించి శిక్షణకు అర్హత కల్పించనున్నారు. ఆసక్తి గల వారు మున్సిపల్ స్టేడియంలోని వీడీసీఏ కార్యాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి పేర్లు నమోదు చేసుకోవచ్చని వీడీసీఏ కార్యదర్శి పార్థసారథి తెలిపారు. 2015 సెప్టెంబర్ ఒకటో తేదీన గాని తర్వాత గాని జన్మించిన వారు అండర్–10లో ఎంపికలకు అర్హులన్నారు.

అరకు వరకే కిరండూల్ పాసింజర్


తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం మధ్య నడిచే పాసింజర్ రైళ్లు ఆయా తేదీల్లో అరకు వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (58501/58502) పాసింజర్ ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు అరకు స్టేషన్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుందన్నారు. అలాగే విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (18515/18516) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు అరకు స్టేషన్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుందన్నారు. దార్లిపుట్–పాడువా స్టేషన్ల మధ్య జరుగుతున్న రెండో లైన్ సంబంధిత పనుల వల్ల ఆయా తేదీల్లో అరకు–కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవని పేర్కొన్నారు.

విశాఖ మహిళా కళాశాలకు హెచ్‌పీసీఎల్ విరాళం


కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ సీజీఎం కిరణ్‌కుమార్, ఈడీ రామకృష్ణన్

మహారాణిపేట: విశాఖ మహిళా కళాశాల అభివృద్ధి కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హెచ్‌పీసీఎల్ రూ.50 లక్షల విరాళం అందించింది. ఆ సంస్థ సీజీఎం జి.కిరణ్ కుమార్, విశాఖ రిఫైనరీ ఈడీ ఆర్.రామకృష్ణన్, అధికారి శ్రీనివాసరావు బుధవారం కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్‌ను తన చాంబర్‌లో కలిసి చెక్కును అందజేశారు. విశాఖ మహిళా కళాశాలలో టాయిలెట్ బ్లాక్ ఆధునికీకరణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉపయోగించాలని కళాశాల అధికారులకు కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, సీపీఓ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉన్నట్లే..


పాట వినిపిస్తే టీవీ..


శబ్దం వస్తే ఫ్యాన్


సర్వే చేపడుతున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)


ఫొటో తీస్తున్న సచివాలయం కార్యదర్శి (ఫైల్)

మీ ఇంట్లో టీవీ లేకున్నా పాట వినిపించిందంటే ఉన్నట్లే.. మీ ఇంట్లో మూడు రూమ్‌లు ఉన్నాయా అయితే మూడు ఫ్యాన్లు ఉన్నట్లే.. మీరు రోజూ దుస్తులు ఉతుకుతున్నారా.. అయితే వాషింగ్ మెషీన్ ఉన్నట్లే.. మీ ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశారా.. అయితే వాహనం ఉన్నట్లే.. మీ ఇంట్లో డిగ్రీ చదివిన వాళ్లు ఉన్నారా? అయితే అందరూ సంపాదించినట్లే.. ఎండలు మండిపోతున్నాయని అప్పో సప్పో చేసి, నెలవారీ వాయిదాల్లో ఏసీలు కొనుక్కున్నారో మీరు ధనవంతుల కిందే లెక్క.. అద్దె ఆదాయం పొందేవారు, పింఛనుదారులు కూడా సంపాదనాపరులే..

ఇదీ పీ–4 సర్వే జరిగిన తీరు.

పీ-4 సర్వే జరిగిన తీరుపై ప్రజల్లో గుబులు

ఇంకా ఏం నమోదు చేశారోనని ఆందోళన

సర్వేపై సర్వత్రా ఆందోళన

సచివాలయ సిబ్బంది క్లస్టర్ల వారీగా ఇంటింటికీ వెళ్లి సుమారు 27 ప్రశ్నలతో కూడిన సమాచారాన్ని సేకరించారు. కుటుంబ యజమాని పేరు, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలతో పాటు ఇంట్లో టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, ఏసీ, ల్యాప్‌టాప్ వంటి గృహోపకరణాలు ఉన్నాయా? కుటుంబంలో ఎంతమంది సంపాదిస్తున్నారు, వారి ఉద్యోగ వివరాలు, నెలసరి ఆదాయం, ఖర్చులు, ఆస్తులు, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపులు, బైక్/కారు వివరాలు, వంట గ్యాస్, కరెంట్ బిల్లు, కుళాయి కనెక్షన్ వంటి వ్యక్తిగత వివరాలను కూడా నమోదు చేసుకున్నారు. ఈ వివరాల సేకరణపై ప్రజలు అప్పట్లోనే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అలాగే కుటుంబ సభ్యుల్లో డిగ్రీ ఆపై చదివిన వారి వివరాలు, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏయే పథకాలు పొందుతున్నారు అనే సమాచారాన్ని కూడా సేకరించి యాప్‌లో నమోదు చేశారు. వ్యవసాయ కూలీలు, అద్దె ఆదాయం పొందే వారు, పింఛనుదారులు కూడా సంపాదనపరులుగా లెక్కించినట్లు తెలుస్తోంది.

డాబాగార్డెన్స్/అల్లిపురం: జిల్లాలో ఇటీవల ముగిసిన పీ–4(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్ట్‌నర్‌షిప్) సర్వే ఇప్పుడు ప్రజల్లో గుబులు రేపుతోంది. కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకే ఈ సర్వే నిర్వహించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. ప్రజలు మాత్రం దీనిని తమ సంక్షేమ పథకాలకు ఎసరు పెట్టే ప్రయత్నంగా అనుమానిస్తున్నారు. పేదరిక నిర్మూలనకు కార్పొరేట్ భాగస్వామ్యంతో ఏదో చేస్తామని చెప్పడం, సర్వేలో అడిగిన సున్నితమైన ప్రశ్నలు ప్రజల సందేహాలను మరింత పెంచాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను కూటమి ప్రభుత్వం పది నెలలు గడుస్తున్నా.. అమలు చేయకపోవడంతో, ఈ హామీల వైఫల్యం నుంచి దృష్టి మళ్లించే ఎత్తుగడగా పీ–4 సర్వేను ప్రజలు ఆరోపిస్తున్నారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?

ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్'వంటి హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. పది నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయడంలో విఫలమైంది. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20 వేలు, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1,500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి ఏటా రూ.15 వేలు, ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛను వంటి ప్రధాన హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ఉన్న పథకాలను కూడా ఎత్తివేసేందుకే ఈ పీ–4 సర్వేను ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని, ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా పీ–4 కార్యక్రమానికి ప్రభుత్వం సొంతంగా నిధులు కేటాయించకుండా, కార్పొరేట్ సంస్థలు, సంపన్నుల భాగస్వామ్యంతో పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పడం పట్ల కూడా విస్మయం వ్యక్తమవుతోంది. ఇప్పుడు ఈ సర్వే పూర్తయిన నేపథ్యంలో, ఇందులో ఏయే వివరాలు నమోదు చేశారోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిరాకరించినా.. నమోదే.!

ఒకవేళ కుటుంబ సభ్యులు సర్వేకు నిరాకరిస్తే, వారికి సర్వే ఉద్దేశాన్ని మళ్లీ వివరించి, నచ్చజెప్పాలని సిబ్బందికి ఉన్నతాధికారులు సూచించారు. అప్పటికీ ఒప్పుకోకపోతే 'సమ్మతి నిరాకరించారు(డినైడ్ కన్సెంట్)' అని నమోదు చేసి బయోమెట్రిక్‌తో ధ్రువీకరించారు. ఇది ప్రజలను మరింత కలవరపెడుతోంది. యజమాని అందుబాటులో లేకపోయినా, వలస వెళ్లినా, మరణించినా వివరాలు నమోదు చేశారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆధార్ వివరాలు, ఓటీపీలు అడగడంపై అప్పట్లో ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఓటీపీలు అడిగారు


సచివాలయం సిబ్బంది సర్వే పేరుతో ఇంటికి వచ్చారు. ప్రతి దానికీ ఓటీపీలు అడిగారు. అసలే బ్యాంకు ఖాతాలో డబ్బులు కాజేసేందుకు ఎన్నో సైబర్ క్రైంలు జరుగుతున్నాయి. ఇలా మాటిమాటికీ ఆధార్ చూపించమని, సెల్‌లో ఓటీపీ వచ్చిందా అని అడిగి దాన్ని చెప్పాలని ఇబ్బంది పెట్టారు. ఇది మా వ్యక్తిగత గోప్యతకు, భద్రతకు విఘాతం కలిగిస్తోంది.

– కె.సుగుణ, వెంకటేశ్వరమెట్ట

టార్గెట్‌లు తగ్గించాలి


సర్వేలపై సర్వేలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పీ–4, వర్క్ ఫ్రమ్ హోమ్, చైల్డ్ విత్ అవుట్ ఆధార్, ఈ–కేవైసీ తదితర సర్వేలు నిరంతరం చేస్తున్నాం. సెలవు రోజుల్లో కూడా పని ఒత్తిడి తప్పడం లేదు. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణకు సరైన స్పందన రావడం లేదు. అధికారులు సిబ్బందికి పని ఒత్తిడి, టార్గెట్‌లు తగ్గించాలి.

– పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ఒక్కో వ్యక్తికి ఒక్కో పోలీసును పెట్టాలా..

హోం మంత్రి అనిత అసహనం

- జగన్ భద్రతా వైఫల్యంపై మీడియా ప్రతినిధుల ప్రశ్నలు
- సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలిన హోం మంత్రి


విలేకరులతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

విశాఖ సిటీ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతా వైఫల్యంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. వారు అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పలేక చిందులు తొక్కారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రామగిరి పర్యటనలో భద్రతా వైఫల్యంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం విశాఖలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు జగన్ పర్యటనకు భద్రత కల్పించలేక ప్రభుత్వం చేతులెత్తేసిన అంశంపై హోం మంత్రికి ప్రశ్నలు సంధించారు. జగన్ పర్యటనకు భారీగా జనాలు వస్తారని గుర్తించలేకపోవడం ఇంటెలిజెన్స్ వైఫల్యమా? డ్రోన్, సీసీ కెమెరాల సర్వైలెన్సు ఉన్నప్పటికీ మాజీ ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతా వలయం బలహీనంగా ఉందా? అని విలేకరులు ప్రశ్నించారు. దీనిపై మంత్రి అనిత ముందు సమాధానం చెప్పలేక తడబడ్డారు. కొద్ది క్షణాల తర్వాత 1100 మందితో భద్రత కల్పించామని, అందరూ తోసుకెళ్లడంతో హెలికాప్టర్‌కు లైట్ క్రాక్ మాత్రమే అయిందని చాలా తేలికగా మాట్లాడారు. అంత మందితో భద్రత కల్పించినా జనాలు తోసుకుంటూ రావడం పోలీసుల వైఫల్యం కాదా? అని మీడియా అడిగితే.. ఒక్కో మనిషికి ఒక్కో పోలీసును పెట్టాలా? అని తిరిగి మంత్రి విచిత్రంగా ప్రశ్నించారు. ఇంతలో మరో ప్రశ్న వేస్తున్న సమయంలో అనిత మీడియాపై రుసరుసలాడుతూ మధ్యలోనే లేచి వెళ్లిపోయారు.

శేష వాహనంపై అప్పన్న తిరువీధి


సింహగిరి మాడ వీధుల్లో శేషవాహనంపై స్వామి తిరువీధి

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం స్వామికి శేషవాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి శేషవవాహనంపై కొలువుంచారు. సింహగిరి మాడ వీధుల్లో నిర్వహించిన తిరువీధిలో భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది.

నేడు వైదిక సదస్యం, పండిత సదస్సు

కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.30 నుంచి వైదిక సదస్యం, మధ్యాహ్నం 3 నుంచి పండిత సదస్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుంచి సర్వజన మనోరంజని వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు.

నిజరూప దర్శనానికి పక్కా ఏర్పాట్లు

సింహాచలం: ఈ నెల 30న జరిగే చందనోత్సవం రోజు భక్తులందరికి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సింహగిరి పైనున్న కాటేజీలో బుధవారం జిల్లా దేవదాయశాఖ అధికారులు, సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు, ఇంజినీరింగ్ అధికారులతో చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. పలు ప్రాంతాల్లో పర్యటించారు. చందనోత్సవం రోజు ఉచిత దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. రూ.300, రూ.వెయ్యి, రూ.1,500 ప్రత్యేక దర్శన టిక్కెట్ల క్యూ మార్గాలను పరిశీలించారు. గతంలో ఆయా ప్రాంతాల్లో చోటుచేసుకున్న లోటుపాట్లను అధికారులకు సూచించారు. ఏ ఒక్క భక్తుడికి అసౌకర్యం కలగకుండా బాధ్యతగా అందరూ విధులు నిర్వర్తించాలన్నారు. ఏర్పాట్లపై దేవస్థానం ఈవో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శోభారాణి, సింహాచలం దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈలు నాగేశ్వరరావు, హరి, ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణ మార్పుల అధ్యయనంతోనే రాణింపు

డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులతో హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్


న్యాయ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్

సబ్బవరం: న్యాయ విద్యార్థులు కాలానుగుణంగా వస్తున్న మార్పులను అధ్యయనం చేస్తూ, విశ్వవిద్యాలయ వనరులను వినియోగించుకుని వృత్తిలో రాణించాలని హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో బుధవారం నిర్వహించిన 'న్యాయ విద్య–న్యాయవాద వృత్తి'సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వర్సిటీలో విద్యాభ్యాసం పూర్తిచేసుకుని బయట ప్రపంచంలో అడుగుపెట్టిన తరువాత పట్టించుకునేవారెవరూ ఉండరని, మనకు మనమే ఎదగాలన్నారు. అందుకే విశ్వవిద్యాలయంలోని వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని కాలాన్ని వృథా చేసుకోకుండా అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మిత్రులతో సబ్జెక్టు అంశాలపై చర్చిస్తూ, అధ్యాపకులతో సందేహ నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మన దగ్గరకు వచ్చే ప్రతి కేసును అంగీకరించి, వాదించే నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. వర్సిటీలో బోధిస్తున్న సబ్జెక్టులతో పాటు దేశంలోని అన్ని హైకోర్టులు, సుప్రీం కోర్టుల్లో వెలువడే తీర్పులను అధ్యయనం చేస్తూ, అవగాహన పెంచుకున్నప్పుడే వృత్తిలో రాణించగలరన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు, రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మదాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

జిల్లా స్థాయి రెవెన్యూ వర్క్ షాప్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది వ్యూహాత్మకంగా వ్యవహరించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి రెవెన్యూ వర్క్ షాప్‌లో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. రెవెన్యూ పరమైన అన్ని అంశాలపై, నిబంధనలపై, ప్రభుత్వం జారీ చేసే జీవోలపై పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ అవగాహన కలిగి ఉండాలని, సవరణలు, మార్పులపై అప్‌డేట్ అవుతూ ఉండాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ, భూముల బదలాయింపు, సర్వే, మ్యూటేషన్, రిజిస్ట్రేషన్, గిఫ్ట్ డీడ్, కన్వెయన్స్ డీడ్, 22ఏ జాబితా, ప్రభుత్వ భూముల ఆక్రమణ చర్యలు, 27, 30, 296, 388 వంటి జీవోల అమల్లో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న వివిధ సమస్యలను తహసీల్దార్లు, డీటీలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇనాం, దేవదాయ శాఖ పరిధిలోని భూముల విషయంలో వివరాలు సరిపోలడం లేదని, జీవో 30, 296, 388 అమల్లో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. 22ఏ జాబితాలను వెబ్‌ల్యాండ్‌లో పొందుపరిచే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని సూచించగా ప్రభుత్వానికి నివేదించి తదుపరి చర్యలు చేపడతామని కలెక్టర్ బదులిచ్చారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ, ఆర్డీవోలు సంగీత్ మాథుర్, పి.శ్రీలేఖ, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ల్యాండ్ సెక్షన్ అధికారులు, తహసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లకు కుళ్లిన టమాటా

- 'చిత్తూరు' టమాటాను అంటగడుతున్న అధికారులు
- వాటిని కొనేందుకు ఇష్టపడని వినియోగదారులు
- చేతి డబ్బులు కట్టాల్సి వస్తోందని స్టాళ్ల నిర్వాహకుల ఆవేదన


మర్రిపాలెం నుంచి రైతు బజార్లకు సరఫరా చేస్తున్న టమాట

విశాఖ విద్య: జిల్లాలోని రైతు బజార్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్న రైతులకు, స్టాళ్ల నిర్వాహకులకు టమాటా విక్రయాలు భారంగా మారుతున్నాయి. చిత్తూరు నుంచి వచ్చిన టమాటాలు రైతు బజార్లకు చేరేటప్పటికే కుళ్లి కంపుకొడుతున్నాయి. ఈ కుళ్లిన టమాటాలు అమ్ముడయ్యే పరిస్థితి లేక, చేతి డబ్బులు కట్టాల్సి వస్తోందని స్టాళ్ల నిర్వహిస్తున్న రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన టమాటా మొత్తం విక్రయించాల్సిందేనని మార్కెటింగ్ శాఖ అధికారులు టార్గెట్లు పెడుతున్నారు. ఒక్కో స్టాల్‌లో రోజుకు రెండు లేదా మూడు క్రేట్‌ల టమాటాలను విక్రయించాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో రోజంతా సరకులు విక్రయించగా వచ్చే లాభాన్ని టమాటా అమ్మకాల రూపంలో తిరిగి ప్రభుత్వమే దోచుకుంటోందని రైతులు వాపోతున్నారు.

రైతులపైనే రవాణా భారం

చిత్తూరు మార్కెట్ నుంచి టమాటాను లారీ ద్వారా జిల్లాకు తెచ్చి, నగరంలోని మర్రిపాలెం రైతుబజారు వద్ద వదిలేస్తున్నారు. ఇక్కడ నుంచి జిల్లాలోని 13 రైతు బజార్లకు మార్కెటింగ్ శాఖ అధికారులు టమాటాను సరఫరా చేస్తున్నారు. అయితే రవాణా చార్జీల రూపంలో ఒక్కో క్రేట్‌కు రైతుల నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. కుళ్లిన టమాటాతో నష్టపోతున్న తమకు రవాణా భారం వేయడమేంటని స్టాళ్ల నిర్వాహకులు వాపోతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే కార్డు తొలగిస్తామంటూ అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

క్రేట్లలోని టమాటా మాయం?

టమాటా నిల్వ చేసే క్రేట్ బరువు(సుమారు కిలో)తో కలిపి 26 కేజీల టమాటాగా మార్కెటింగ్ శాఖాధికారులు లెక్క చెబుతున్నారు. దీని ప్రకారమే ఏ రోజుకారోజు నిర్ణయించిన ధర మొత్తాన్ని రైతులు చెల్లించాలి. అయితే ఆ క్రేట్‌లో వస్తున్న వాస్తవ టమాటా బరువెంతనే తూకం వేసే పరిస్థితి లేదు. లారీలో నుంచి నేరుగా ఆటో/మినీ వ్యాన్ల ద్వారా రైతు బజార్లకు తెచ్చి, కళాసీల సాయంతో స్టాళ్లకు చేరవేస్తారు. ఇలావచ్చే ఒక్కో క్రేట్‌లో రెండు కిలోల వరకు టమాటా మాయమవుతోందని రైతులు బాహాటంగానే చెబుతున్నారు. మరోవైపు క్రేట్‌లో మూడు నుంచి నాలుగు కేజీలు పాడైన టమాటాలు ఉంటున్నాయి. ఈ పరిణామాలు తమకు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయని వాపోతున్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తే, టమాటా మాయం వెనుక సూత్రధారులు ఎవరనేది తేటతెల్లమవుతుందని రైతులు చెప్పున్నారు.

కుళ్లిన టమాటా ఏం చేసుకుంటాం!




రైతు బజారులో సరసమైన ధరలకు నాణ్యమైన సరకులు విక్రయిస్తున్నట్లు కూటమి పెద్దలు చెబుతున్నారు. విశాఖలోని రైతుబజార్లలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. చిత్తూరు టమాటా అంటగడుతుండటంతో జిల్లాకు చెందిన రైతులు తమ పంటను రైతుబజారుకు తీసుకురాకుండా, బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో రైతు బజార్లలో కుళ్లిన టమాటాను వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రేటు తక్కువన్న మాటేకానీ, కుళ్లిన వాటిని ఇంటికి తీసుకెళ్లి ఏంచేసుకోవాలని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి


వెంకటరమణ (ఫైల్)

పద్మనాభం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన పద్మనాభం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వానపల్లి వెంకటరమణ(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈయన ఎస్.రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలో పదో తరగతి మూల్యాంకనానికి వెళ్లి సాయంత్రం పద్మనాభంలోని తన ఇంటికి వచ్చాడు. అనంతరం సొంత పని మీద ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో రామనారాయణపురం సమీపంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణకు తీవ్ర గాయాలు కాగా విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. వెంకటరమణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఎంబీఏ, కుమార్తె పీజీ పూర్తి చేశారు. వెంకటరమణ మృతిపై ఉపాధ్యాయ సంఘాల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



• నిలిచిన డ్రెడ్జింగ్

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మంగళవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు సాధారణ స్థాయికి మించి ఎగసిపడ్డాయి. ఈ ప్రభావం సబ్‌మెరైన్ మ్యూజియం వెనుక భాగంలో జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులపై పడింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన కెరటాల ధాటికి డ్రెడ్జర్ నుంచి తీరానికి ఇసుకను తరలించడానికి ఉపయోగించే భారీ రబ్బరు ట్యూబ్ ఒడ్డుకు కొట్టుకువచ్చింది. దీంతో డ్రెడ్జింగ్ పనులు నిలిచిపోయాయి. ఈ రబ్బరు ట్యూబ్‌ను తిరిగి డ్రెజ్జర్‌కు అనుసంధానించి పనులను ప్రారంభించేందుకు డీసీఐ చర్యలు తీసుకుంటోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గిఫ్ట్ డీడ్ భూముల్లో గోల్‌మాల్

- మధురవాడలో కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- అందుల్లో దుకాణాలు నిర్మించి రూ.లక్షల్లో అద్దె వసూళ్లు
- వాటికి ట్యాక్స్‌లు వేస్తున్న జీవీఎంసీ అధికారులు



వుడా కాలనీ రోడ్డు జంక్షన్‌లో గిఫ్ట్ డీడ్ ఇచ్చిన స్థలంలో వెలిసిన దుకాణాలు



గిఫ్ట్ డీడ్ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని జెడ్సీకి ఫిర్యాదు ఇస్తున్న దృశ్యం(ఫైల్)

మధురవాడ: అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుంది మధురవాడ పరిసర ప్రాంతాల్లోని గిఫ్ట్ డీడ్ ఇచ్చిన కోట్ల విలువ చేసే స్థలాల పరిస్థితి. మధురవాడ జోన్‌లో మిథిలాపురి వుడా కాలనీ, నగరం పాలెం రోడ్డు తదితర వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం కోసం జీవీఎంసీ కోట్ల విలువైన భూమిని సేకరించింది. హైవే, మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆనుకుని ఉన్న ఈ స్థలాలు.. ఇప్పుడు ప్రైవేటు, అనధికార వ్యక్తుల వశమైపోతున్నాయి. ఇందుకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ–హైవే జంక్షన్ కార్నర్‌లో ఉన్న సర్వే నంబర్ 248/10లోని 672 గజాల స్థలమే ఉదాహరణ. దీని మార్కెట్ విలువ సుమారు 4 కోట్ల రూపాయలు ఉండగా, బహిరంగ మార్కెట్‌లో 7 కోట్ల రూపాయలకు పైనే ఉంటుందని అంచనా. ఇక్కడ పిళ్లా ముకుందయ్య–అప్పలస్వామి వారసులు 2008 మేలో 1080 గజాల్లో అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా 420 గజాల్లో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి జీవీఎంసీ అనుమతి ఇచ్చింది. మిగిలిన 672 గజాల భూమిని జీవీఎంసీ స్వాధీనం చేసుకుంది. తర్వాత ఇక్కడ జీవీఎంసీకి స్థలం ఇచ్చిన వ్యక్తులు, రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు పాగా వేసేశారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా హోటల్‌తో పాటు ఐదు వాణిజ్య దుకాణాలు నిర్మించి, వాటి ద్వారా నెలకు లక్షల్లో అద్దె వసూలు చేస్తున్నారు. విశేషం ఏమిటంటే ప్రభుత్వ అవసరాల కోసం గిఫ్ట్ డీడ్ ద్వారా పొందిన భూమిలో వెలిసిన ఈ అనధికార దుకాణాలకు జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులే పన్నులు విధించడం. ఇది అత్యంత విలువైన కార్నర్ బిట్ కావడంతో.. అప్పటి నుంచి సదరు వ్యక్తులే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ భూమికి సంబంధించిన వారసుల్లో వివాదాలు తలెత్తడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరు వారసులు ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని జీవీఎంసీ ఉన్నతాధికారులతో పాటు పీజీఆర్‌ఎస్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఏడాది కాలంగా ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ.. జీవీఎంసీ అధికారులు మాత్రం పరిశీలన పేరుతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నగరంపాలెం రోడ్డు జంక్షన్‌లో రోడ్డు విస్తరణకు అడ్డంకిగా మారిన భవనాల్లో ఇదొకటి

ఇంతేనా..

- మిథిలాపురి వుడా కాలనీ రోడ్డు నుంచి ఐటీ సెజ్‌కు వెళ్లే మార్గంలో యమహా షోరూమ్ సమీపంలో కూడా ఇదే తరహాలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని సమాచారం. గతంలో ఇక్కడ హాకర్స్ జోన్ ఏర్పాటుకు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించినప్పటికీ.. టీడీపీ నాయకుల ఒత్తిడి కారణంగా ఆ ప్రయత్నం విఫలమైంది. ఈ స్థలం విలువ కూడా కోట్లలో ఉంటుందని అంచనా. ఇక్కడ కొందరు కూటమి నాయకులు దుకాణాలు ఏర్పాటు చేసి లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- హైవే నుంచి నగరంపాలెం వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ కోసం ఓ భవన యజమాని టీడీఆర్ తీసుకున్నప్పటికీ.. తొలగింపునకు సహకరించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ విషయం జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో భవనాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదు. ఇక్కడ ఒక ప్రైవేట్ బ్యాంకు కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఈ భూముల ఆక్రమణల కారణంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్నప్పటికీ.. అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాలికల విద్యకు బాసట

- కేజీబీవీల్లో 6 నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య
- ప్రవేశాలకు ఈ నెల 11 తుది గడువు



ట్యాబ్‌ల ద్వారా చదువుకుంటున్న విద్యార్థినులు

విశాఖ విద్య: బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు మెరుగైన ఫలితాలిస్తున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా అత్యుత్తమ విద్యా బోధన అందిస్తూ బాలికల భవితకు భరోసా కల్పిస్తున్నాయి. 11 నుంచి 17 ఏళ్ల వయస్సున్న బాలికలకు ఇక్కడ 6 నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య అందిస్తున్నారు. అనాథ బాలికలు, దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు చెందిన బాలికలకు కేజీబీవీ ప్రవేశాల్లో ప్రాధాన్యత ఇస్తారు.

నాడు–నేడుతో సకల హంగులు

అనాథలు, నిరుపేద వర్గాలకు చెందిన బాలికల కోసం ప్రత్యేకంగా కేజీబీవీలను ఏర్పాటు చేశారు. వీటి ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా కేజీబీవీల్లో సకల హంగులు కల్పించారు. టోఫెల్ కంటెంట్‌తో డిజిటల్ విద్యా బోధన, ట్యాబుల వినియోగంతో ఇక్కడి విద్యార్థినులు చదువులతో పాటు, వివిధ పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా గత ప్రభుత్వం అవకాశాలు కల్పించింది.

బోధనలో 'స్మార్ట్'

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ప్రాధాన్యత నేపథ్యంలో పాఠశాల స్థాయిలోనే సాంకేతిక విప్లవం మొదలైంది. స్మార్ట్ పాఠాల బోధనతో కేజీబీవీల్లో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పనలో కేజీబీవీ విద్యార్థినులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 42 కేజీబీవీలు

విశాఖ జిల్లాలో 3, అనకాపల్లి జిల్లాలో 20, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 19 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఆసక్తిగల బాలికలు ఈ నెల 11లోగా http:/apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో విద్యాలయంలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో కూడా ప్రవేశం పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



కేజీబీవీల్లో ప్రవేశాలపై దృష్టి సారించాం. విద్యార్థినుల బంగారు భవిష్యత్ కోసం శతథా కృషి చేస్తున్నాం. అర్హులైన విద్యార్థినులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ లేదా కేజీబీవీల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చు.

– డాక్టర్ జోగ చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

రైల్వే క్రీడాసంఘం నూతన కార్యవర్గం

విశాఖ స్పోర్ట్స్: తూర్పు కోస్తా రైల్వే క్రీడా సంఘం వాల్తేర్(ఈకోర్సా) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షునిగా డీఆర్ఎం లలిత్ బోరా కొనసాగనుండగా క్రీడాధికారిగా సీనియర్ డీఎఫ్ఎం ఎం.హేమంత్ ఎన్నికయ్యారు. సంయుక్త క్రీడాధికారిగా ఎ.అవినాష్ కొనసాగనుండగా సహాయ క్రీడాధికారులుగా ఔట్‌డోర్ క్రీడలకు డీఈఈ సాహు, ఇండోర్ క్రీడలకు సీడీఓ పాటిల్ పర్యవేక్షించనున్నారు. కార్యదర్శిగా ధ్యాన్‌చంద్ అవార్డీ ఎస్.ఉష వ్యవహరించనున్నారు. ఉపాధ్యక్షులుగా ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్, ఈ.సాంతారామ్, సలహాదారుగా సీనియర్ డీఈఎస్ అరుణకుమార్ మోహరానా, కోశాధికారిగా సీనియర్ డీపీవో జుసఫ్ కబీర్ అన్సారి సేవలందించనున్నారు.

పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు..

డాబాగార్డెన్స్: గాజువాక పోలీసులు తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆరోపించారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరఫున ఎన్నో పోరాటాలు చేశానని, తనకు జరిగిన అన్యాయానికి ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నామినేటెడ్ పోస్టు వస్తుందని, కొంత మంది తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నరేంద్ర అనే వ్యక్తి తనతోపాటు పలువురి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని, ఈ విషయమై మోసపోయిన వ్యక్తులతో కలిసి తాను పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని తెలిపారు. అక్కడ తనతో అసభ్యకరంగా నరేంద్ర మాట్లాడడంతో చెప్పుతో కొట్టానని తెలిపారు.

తుక్కు దుకాణంలో కార్మికుడి మృతి

పరవాడ: మండల కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన తుక్కు దుకాణంలో బుధవారం ఓ కార్మికుడు మృతి చెందాడు. విజయనగరం ప్రాంతానికి చెందిన సత్యనారాయణ పరవాడలో గత కొంత కాలంగా తుక్కు దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణంలో రసాయన డమ్ములను శుభ్రం చేస్తుండగా బుచ్చెయ్యపేట మండలం నీలకంఠపురానికి చెందిన పడాల హరనాథ్(24) ప్రాణాలు కోల్పోయాడు. ఫార్మాసిటీలోని పరిశ్రమల నుంచి ఖాళీ రసాయన డ్రమ్ములను కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువస్తారు. వాటిని కార్మికులతో శుభ్రం చేయించిన తర్వాత అధిక ధరకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం దుకాణంలోని ఖాళీ రసాయన డ్రమ్ములను శుభ్రం చేసే పనిని హరనాథ్‌కు అప్పగించారు. వీటిని శుభ్రం చేస్తున్న క్రమంలో రసాయనాలను పీల్చడంతో హరనాథ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. తోటి కార్మికులు అందించిన సమాచారంతో యాజమాన్యం అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ హరనాథ్ ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హరనాథ్‌కు వివాహం కాలేదు. కాగా.. నిబంధనలకు విరుద్ధంగా రసాయన డ్రమ్ములను కొనుగోలు చేసి కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తుక్కు దుకాణ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ ఆరోపించారు. తుక్కు దుకాణానికి రసాయన డ్రమ్ములను సరఫరా చేసిన సంబంధిత పరిశ్రమ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి దుకాణ యాజమాన్యం రూ.కోటి నష్ట పరిహారంగా చెల్లించాలన్నారు.

చెరువు కాదు.. ఏయూ మైదానం



ఏయూ ఇంజనీరింగ్ క్రీడా మైదానంలో నిలిచిన వర్షపు నీరు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానం చెరువును తలపిస్తోంది. మంగళవారం రాత్రి నగరంలో కురిసిన వర్షానికి ఏయూ గ్రౌండ్‌లో భారీగా నీరు చేరింది. దీంతో బుధవారం క్రీడాకారులు అటువైపు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కో చోట మోకాళ్ల లోతు వర్షపు నీరు నిల్వ ఉండిపోగా.. మైదానం మొత్తం చిత్తడిగా తయారైంది. ఈ మైదానాన్ని ఇటీవలే అభివృద్ధి చేశారు. ఇక్కడే ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ నిర్వహించారు. ఇందుకోసం గ్రౌండ్ మొత్తాన్ని ఇష్టానుసారంగా తవ్వేశారు. గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న కాలువలను సైతం మట్టితో కప్పేశారు. వర్షపు నీరు బయటకు పోయేందుకు మార్గం లేకపోవడంతోనే ఇప్పుడు మైదానం మధ్యలోనే నీరు నిలిచిపోయింది. చిన్నపాటి వర్షానికే మైదానం ఇలా తయారైతే.. భారీగా వర్షం కురిస్తే పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని క్రీడాకారులు, ఆచార్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు మళ్లీ చోటు చేసుకోకుండా.. వర్సిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీర ప్రాంతాల్లో 'సాగర్ కవచ్'



రుషికొండ బీచ్‌లో పర్యటించిన మెరైన్ డీఐజీ గోపినాథ్ జెట్టీ



స్టీల్‌ప్లాంట్ వాచ్ టవర్ వద్ద ఇద్దరిని పట్టుకున్న సీఐడబ్ల్యూ సిబ్బంది

కొమ్మాది: సాగర తీర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం భీమిలి, మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రుషికొండ బీచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ పి.మనోజ్ కుమార్ తీర ప్రాంతాల అప్రమత్తతపై మత్స్యకారులకు, పర్యాటకులకు వివరించారు. తీర ప్రాంతాల వెంబడి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే ఎలా ఎదుర్కొని పోలీసులకు సమాచారం ఇవ్వాలి, ఎలా అప్రమత్తంగా ఉండాలి, గూఢచారి వ్యవస్థలను ఎలా కనుగొనాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

డీఐజీ పర్యటన: సాగర్‌కవచ్‌లో భాగంగా రుషికొండ బీచ్‌లో బుధవారం రాత్రి మెరైన్ డీఐజీ గోపినాథ్ జెట్టీ పర్యటించారు. ఇక్కడ బీచ్‌లోని పర్యాటకులతో కాసేపు మాట్లాడి, మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఆయన వెంట మెరైన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు మురళీకృష్ణ, పి. మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉత్కంఠగా..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో సాగర్ కవచ్ ఆపరేషన్ మొదటి రోజు ఉత్కంఠగా సాగింది. సీఐఎస్ఎఫ్ క్రైం అండ్ ఇంటెలిజెన్స్ వింగ్ (సీఐడబ్ల్యూ) సిబ్బంది నలుగురు ఆగంతకులను పట్టుకున్నారు. ముంబై దాడులు అనంతరం దేశంలోని అన్ని సెక్యూరిటీ దళాలు కలిసి ఏటా రెండుసార్లు సాగర్ కవచ్ నిర్వహిస్తుంటాయి. పరిశ్రమలు, సంస్థల్లో సెక్యూరిటీను పరిశీలించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొంత మంది వ్యక్తులు సముద్ర జలాలు, రహదారుల మీదుగా పరిశ్రమల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తారు. వారిని ఆయా పరిశ్రమల సెక్యూరిటీ సిబ్బంది పట్టుకోవాల్సి ఉంటుంది. బుధవారం సీఐఎస్ఎఫ్ సిబ్బంది, సీఐడబ్ల్యూ సిబ్బంది తనిఖీల్లో భాగంగా ఇద్దరిని ప్లాంట్ ప్లాజా గేటు వద్ద, ఇద్దరిని వాచ్ టవర్ 30 గోడ వద్ద పట్టుకున్నారు.



• వర్షం కురిస్తే.. ఇట్లుంటది!

వర్షం అందరికీ ఆహ్లాదాన్ని పంచుతుంది. అయితే సాగరతీరంలో మాత్రం పరిస్థితి దిగజారుతుంది. వర్షం కురిసిన సందర్భంలో కాలువల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు, కొబ్బరి బొండాలు వంటివి ప్రవాహ వేగానికి కొట్టుకువచ్చి తీరానికి చేరుతున్నాయి. ఆహ్లాదాన్ని పంచే సాగరతీరం దీని ఫలితంగా అధ్వానంగా తయారు అవుతోంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పంట పొలంలో వందలాది ఆధార్ కార్డులు



ఓటర్ ఐడీ కార్డులు



మహిళ ఆధార్ కార్డు



పంట పొలంలో పడి ఉన్న ఆధార్, ఓటర్ కార్డులు

గోపాలపట్నం: నరవ వెళ్లే రహదారిలోని కంపరపాలెం పంట పొలంలో వందలాది ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు గుట్టలుగా పడి ఉండటం స్థానికంగా చర్చనీయాంశమైంది. బుధవారం స్థానికులు వీటిని గుర్తించారు. ఈ కార్డులన్నీ మాధవధార, మురళీనగర్ ప్రాంతాలకు చెందిన వారివి కావడం గమనార్హం. పొలంలో గుర్తింపు కార్డులతో పాటు మద్యం సీసాలు, లైటర్లు కూడా లభ్యమయ్యాయి. ఈ సంఘటనతో స్థానికుల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ కార్డులు అసలైనవా లేదా నకిలీవా.? ఇంత పెద్ద సంఖ్యలో గుర్తింపు కార్డులు పొలాల్లో ఎలా ప్రత్యక్షమయ్యాయి? అనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. ఈ ప్రాంతంలో కొంత మంది ఆకతాయిలు మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటారు. వారే ఈ కార్డులను పడేసి ఉంటారా? లేదా ఆధార్ కేంద్రాలు నిర్వహించే వారు ఈ పని చేసి ఉంటారా? సైబర్ నేరగాళ్ల పనా? ఇలా ఎన్నో ప్రశ్నలు వేధిస్తున్నాయి. ఈ విషయంపై అధికారులు స్పందించి, ఇన్ని కార్డులు ఇక్కడకు ఎలా వచ్చాయో విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

షిప్‌యార్డ్‌లో నిచ్చెన పైనుంచి పడి కార్మికుడి మృతి



అప్పారావు(ఫైల్)

మల్కాపురం: షిప్‌యార్డ్‌లో నిచ్చెనపై నుంచి కింద పడిన సొసైటీ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి.. గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని పాత చెక్‌పోస్ట్ ఏరియాలో పిలక అప్పారావు(56) అలియాస్ అప్పారావు రెడ్డి తన భార్య, కుమారుడు, కుమార్తెతో నివాసం ఉంటున్నాడు. పిలక అప్పారావు షిప్‌యార్డ్‌లో మాజీ సొసైటీ కార్మికుడిగా 30 ఏళ్ల నుంచి పని చేస్తున్నాడు. షిప్‌యార్డ్ హాల్‌షాప్ డిపార్ట్‌మెంట్ వద్ద బుధవారం ఉదయం 8.30గంటల సమయంలో ఈవోటీ క్రేన్‌పైకి వెళ్లేందుకు నిచ్చెన ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడి నుంచి అదుపు తప్పి కిందకు పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని తోటి కార్మికులు సంస్థ ఆవరణలోని ఆసుపత్రి వద్దకు తొలుత తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందాడు. కాగా.. తమకు న్యాయం చేయాలని మృతుడి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. పోలీసులు, యూనియన్ ప్రతినిధులు కలగజేసుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.



కాలుష్య కాసా(గ)రం

ఏయూక్యాంపస్: విశాఖ సాగరతీరం కాలుష్య కాసారంగా మారుతోంది. నగరంలోని మురుగు నీరు నేరుగా సముద్రంలోకి చేరుతోంది. వర్షం కురిసిన ప్రతీ సారి పరిస్థితి మరింత దిగజారుతోంది. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు మురుగునీటితో కలిసి నేరుగా సముద్రంలోకి చేరుతున్నాయి. సాధారణంగా మురుగునీటిని శుద్ధి చేసిన తర్వాతే సముద్రంలోకి వదలాలి. కానీ పాండురంగాపురం, విక్టరీ ఎట్ సీ, సాగర్‌నగర్ వంటి ప్రాంతాల్లో మురుగునీరు నేరుగా సముద్రంలో కలుస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంతో నిండిపోతోంది. దీంతో స్థానికులే కాదు.. పర్యాటకులు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి పట్ల పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని, మురుగునీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

–ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రహదారిపై కూలిన భారీ వృక్షం



సిరిపురం ప్రధాన రహదారిలో కూలిన వృక్షం

ఏయూక్యాంపస్: నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారిలో రెప్పపాటు కాలంలో ఓ భారీ వృక్షం కూలింది. పక్కనే పలు ద్విచక్ర వాహనాలు పార్క్ చేసి ఉన్నాయి. అదృష్టం కొద్దీ ఆ సమయంలో ప్రయాణికులు ఎవ్వరూ రోడ్డుపై లేకపోవడంతో భారీ నష్టం, ప్రమాదం తప్పింది. వివరాలిలా.. వాతావరణ కేంద్రం నుంచి సిరిపురం వెళ్లే ప్రధాన రహదారిలో ఏయూ దూరవిద్య కేంద్రం దాటాక జీవీఎంసీ నీటి సరఫరా ట్యాంక్ ఉంది. దీని గేట్ వద్ద ఉన్న ఒక భారీ వృక్షం బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా గాలికి కూలిపోయింది. చిన్నపాటి గాలికే వృక్షం వేళ్లతో సహా నేలకొరిగింది. భారీ శబ్దంతో రోడ్డుపై కూలడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. పొక్లెయిన్ సాయంతో కూలిన చెట్టును తొలగించారు. చెట్టు కూలే సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.